క్లుప్తంగా

పీహెచ్‌సీని సీహెచ్‌సీగా మార్చండి



పీహెచ్‌సీని పర్యవేక్షించిన సీపీఎం నాయకులు

బలిజిపేట: బలిజిపేట పీహెచ్‌సీని సీహెచ్‌సీగా మార్చాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బలిజిపేట పీహెచ్‌సీని సీపీఎం నాయకులు శుక్రవారం పర్యవేక్షించి మాట్లాడుతూ పీహెచ్‌సీకి ఓపీ నిమిత్తం 70నుంచి 100మంది పేషెంట్లు వస్తున్నారని, ఇన్‌పేషెంట్లు 10మందికి వరకు ఉంటున్నందున సీహెచ్‌సీగా మార్పుచేయడం వల్ల మరిన్ని సేవలు పెరుగుతాయని దీనివల్ల రోగులకు ఇబ్బందులు తగ్గుతాయన్నారు. ప్రస్తుతం ఖాళీగా ఉండే పోస్టులను భర్తీ చేయాలని కోరారు. పీహెచ్‌సీకి వచ్చే మార్గం రోడ్డు నిర్మాణం చేయాలని, అన్ని సౌకర్యాలు కల్పించి సీహెచ్‌సీగా మార్పుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మన్మథరావు, జి.సత్యనారాయణ, బి.భానుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ నూతన కమిషనర్ బాధ్యతల స్వీకరణ



కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్.జయరాం

సాలూరు: స్థానిక మున్సి పాలిటీ నూతన కమిషనర్‌గా ఎస్.జయరాం బా ధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మున్సిపల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించగా కమిషనర్‌కు మున్సిపల్ అధికారులు, సిబ్బంది స్వాగతం పలికారు.

ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్‌గా శ్రీనివాసా చారి



ప్రిన్సిపాల్ శ్రీనివాసా చారి

సాలూరు: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్‌గా శ్రీనివాసా చారి నియమితుల య్యారు. ఆయన నర్సీపట్నం నుంచి బదిలీపై సాలూరు వచ్చారు.

జీఓలు వెంటనే ఇవ్వాలి



జిల్లా వైద్యశాఖ సూపరింటెండెంట్ కామేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

పార్వతీపురంటౌన్: ఆశవర్కర్లకు ప్రభుత్వం అంగీకరించిన ఒప్పందాల మేరకు జీఓలు వెంటనే ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి జి.వెంకటరమణ, ఉపాధ్యక్షురాలు ఇందిర యూనియన్ నాయకులు కోరారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యశాఖ సూపరింటెండెంట్ కామేశ్వరరావుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఆశ వర్కర్లకు కనీస వేతనం అమలు చేయాలని, సెల్‌ఫోన్లు రిపేర్ చేయాలని, సిమ్ కార్డులు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. బకాయి వేతనాలు చెల్లించాలని ఇన్సూరెన్స్, సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో దమయంతి, హేమలత, లక్ష్మి, పారమ్మ పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో భూసారం



నవధాన్యాలు నాటిస్తున్న ఆర్‌వైఎస్ఎస్ మార్కెటింగ్ ప్రతినిధి భాను

గుమ్మలక్ష్మీపురం: నవధాన్యాల సాగుతో భూసారం పెరుగుతుందని ఆర్‌వైఎస్ఎస్ మార్కెటింగ్ ప్రతినిధి బి.భాను తెలిపారు. మండలంలోని దుడ్డుఖల్లు గ్రామ రైతుల నవధాన్యాల క్షేత్రాలను ఆమె శుక్రవారం పరిశీలించారు. ప్రధాన పంట సాగుకు ముందు నవధాన్యాలు వేసుకుని 45 రోజుల తర్వాత మొక్కలను నేలలో కలియదున్నితే నేలకు అవసరమైన పోషకాలు అందుతాయన్నారు. మెట్టు, పోడు ప్రాంతాల్లో ఎకరా పొలానికి 10 నుంచి 15 కిలోల విత్తనాలు(20 నుంచి 30 రకాల విత్తనాల మిశ్రమం) వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఏ జి.అన్నపూర్ణ, మండల ఇన్‌చార్జ్ ఎం.సీతారాం తదితరులు పాల్గొన్నారు.

ఏడాదిగా అభివృద్ధి శూన్యం



ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

పార్వతీపురం:

కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో నియోజకవర్గం అభివృద్ధి శూన్యమని సీపీఎం పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి కె. గంగునాయుడు అన్నారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పార్వతీపురం ఎమ్మెల్యే పనితీరుపై బ్లాక్ పేపర్లతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజలను నిత్యం తాగునీటి సమస్య వెక్కిరిస్తోందని, దీర్ఘకాలికంగా ఉన్న ట్రాఫిక్, రహదారులు, కాలువల సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పట్టణంలో అర్హులైన వారికి టిడ్కో ఇళ్లను అందించేందుకు కనీస ప్రయత్నం చేయడం లేదని ఆరోపించారు. పట్టణ శివారులో ఉన్న నవిరి కాలనీ, వెంకంపేట పరిసరాల్లోని రహదారులకు మరమ్మతులు చేయకపోవడంతో ప్రజలు రాకపోకలు చేసేందుకు నిత్యం ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రహదారులు మరమ్మతులకు గురికావడంతో నిత్యం వాహన ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఏడాది కాలంలో ప్రతిపక్ష పార్టీల కార్యకర్తలు, నాయకులపై కక్ష సాధింపు ధోరణి ప్రదర్శిస్తున్నారే తప్ప అభివృద్ధిపై దృష్టిసారించడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా అధికార పక్షం నాయకులు నియోజకవర్గం అభివృద్ధిపై దృష్టిసారించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు వి.ఇందిర, బీవీ రమణ, జీవీ రమణ, పి.రాజశేఖర్, ఆర్.శ్రీదేవి, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దు

• పట్టణ సీఐ కె.మురళీధర్

పార్వతీపురం రూరల్: వాహన చోదకులు ప్రయాణించేటప్పుడు నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని పార్వతీపురం పట్టణ సీఐ కె. మురళీధర్ పేర్కొన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలతో పాటు నూతనంగా ప్రభుత్వం జారీ చేసిన జరిమానాలను విధించనున్నట్లు తెలిపారు. ప్రధానంగా అతివేగం, ఆకతాయిగా నడపడం, మలుపుల వద్ద నిర్దిష్ట వేగానికి మించి వెళ్లడం వంటివి చేయడం వల్ల తమతోపాటు ఎదురుగా వస్తున్న తోటి వాహన చోదకులు కూడా రోడ్డు ప్రమాదాలకు గురవుతూ ప్రాణాలు కోల్పోతున్న పరిస్థితుల కారణంగా కచ్చితంగా జాగ్రత్తలు పాటిస్తూ రోడ్లపై ప్రయాణించాలని సూచించారు. మద్యం తాగి వాహనాలను నడపరాదని, నడిపితే మొదటిసారి దొరికిన వారిని కోర్టులో హాజరు పరిచి రూ.10వేల జరిమానా విధించే అవకాశాలతో పాటు ఒక్కో సందర్భంలో జైలు శిక్ష కూడా పడే అవకాశం ఉందని స్పష్టం చేశారు. అలాగే రెండోసారి కూడా మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడితే రూ.20వేల వరకు జరిమానా విధించడంతో పాటు జైలు శిక్ష కూడా పడే పరిస్థితి ఉందన్నారు. ఈ మేరకు పట్టణంలో ఆయనతో పాటు ఎస్సై పాపారావు, సిబ్బంది శుక్రవారం వాహనాల తనిఖీ నిర్వహించి వాహనచోదకులకు అవగాహన కల్పించారు.

ప్రమాదాల బారిన పడవద్దు

• రూరల్ ఎస్సై బి.సంతోషికుమారి



టొంకి గ్రామంలో చిన్నారులతో మాట్లాడుతున్న రూరల్ ఎస్సై బి.సంతోషి కుమారి

పార్వతీపురం రూరల్: చిన్నారులు వారికి ఉన్న ఖాళీ సమయాల్లో ఆడుకోవడానికి వెళ్లేటప్పుడు, ప్రమాదాలు కలిగించే ప్రాంతాల్లో ఆటలాడకూడదని పార్వతీపురం రూరల్ ఎస్సై బి.సంతోషి కుమారి అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆమె మండలంలోని టొంకి గ్రామంలో చిన్నారులకు అవగాహన కల్పించారు. తల్లిదండ్రుల మాటలు తప్పకుండా పాటించి బుద్ధిగా నడుచుకోవాలని, నిర్మాణాలు జరిగే ప్రాంతాల్లో, గెడ్డలు, రోడ్లపై నిర్లక్ష్యంగా ఉంటూ ఆటలాడకూడదని హితవు పలికారు. పాఠశాలలో కానీ, గ్రామాల్లో కానీ సురక్షితంగా ఉన్న మైదాన ప్రాంతాల్లో ఆడుకునేందుకు మొగ్గు చూపాలని సూచించారు. అలాగే తల్లిదండ్రులు కూడా పిల్లలు బయటకు వెళ్లేటప్పుడు వారి కదలికలను గమనించాలని కోరారు.

ఆక్రమణలు తొలగించాలి



వినతిపత్రం పరిశీలిస్తున్న తహసీల్దారు బాల

గరుగుబిల్లి: మండలంలోని గిజబ గ్రామంలో ఆర్అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా ఉన్న స్థలాల్లోని ఆక్రమణలు తొలగించాలని ఆ గ్రామానికి చెందిన మండల శివున్నాయుడు, జి.రామకృష్ణ, జి.శ్రీను, జి.ఎల్లమ్మ కోరుతున్నారు. ఇదే విషయమై వారు మండల కేంద్రంలో తహసీల్దారు పి.బాలకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ రహదారికి పక్కన ఉన్న స్థలాలు ఆక్రమించి కంచె వేయడంతో పాటు గొర్రెలకాపర్లు పెంట వేస్తున్నారని ఫిర్యాదు చేశారు.

పెంట వల్ల దోమలు, ఈగలు విపరీతంగా పెరగడంతో పాటు దుర్గంధం వెదజల్లుతోందన్నారు. ఆక్రమణల వల్ల రాకపోకలకు కూడా అంతరాయం ఏర్పడుతోందన్నారు. క్షేత్రస్థాయికి సిబ్బందిని పంపించి చర్యలు తీసుకుంటామని తహసీల్దారు హామీ ఇచ్చారు.

ఆస్పత్రిని అందుబాటులోకి తీసుకురావాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు తిరుపతిరావు, తదితరులు

సీతంపేట: సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.తిరుపతిరావు డిమాండ్ చేశారు. ఏడాది పాలనపై సంబరాలు చేసుకుంటున్న కూటమి నాయకులకు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులు ఎనిమిది నెలలుగా నిలిచిపోయిన సంగతి గుర్తు లేదా అని ప్రశ్నించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఆస్పత్రి పూర్తయితే గిరిజనులకు మెరుగైన వైద్యసేవలు అందుతాయని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జె.మధుసూదన్, పి.వీరన్న, ఎం.లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆమె సేవలు మరువలేం..



సహచరులు అందించిన సహకారం గుర్తుచేసుకుంటున్న ఏపీపీ విజయలక్ష్మి

పాలకొండ రూరల్: స్థానిక జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో అనేక కేసులకు సంబంధించి ఏపీపీ విజయలక్ష్మి అందించిన సేవలు మరువలేమని సహచర న్యాయవాదులు కొనియాడారు. ఏపీపీకి విజయనగరం బదిలీ కావడంతో న్యాయమూర్తి చందక హరిప్రియ ఆధ్వర్యంలో శుక్రవారం అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదుల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సామ్యూల్ మోరా మాట్లాడుతూ.. జూనియర్లకు ఏపీపీ విజయలక్ష్మి ఎన్నో సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో బార్ సభ్యులు కేవీ రమణమూర్తి, జగదీష్‌కుమార్, కె.రవి, బి.రామ్మోహన్, మునిస్వామి, కనపాక సూర్యప్రకాష్, దుప్పాడ ఆనందరావు, కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి: మండలంలోని చిలకాం గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పనిచేసి బదిలీ అయిన ఉపాధ్యాయులు కె.రామ్మోహనరావు, ఎం.మహేష్, జి.రాజశేఖర్‌లను గ్రామపెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు అదే పాఠశాలలో శుక్రవారం సన్మానించారు. విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దడంలో వారు చేసిన విశేష కృషిని విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

కూటమి ప్రభుత్వానికి చెంపపెట్టు

• మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు



పార్వతీపురం టౌన్: సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావు అక్రమ అరెస్టుపై సుప్రీంకోర్టు స్పందించిన తీరుపై పార్వతీపురం నియోజకవర్గ మాజీ శాసనసభ్యుడు అలజంగి జోగారావు స్పందిస్తూ సుప్రీంకోర్టు తీర్పును స్వాగతించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ రాష్ట్రాన్ని పరిపాలిస్తున్న చంద్రబాబు నాయుడికి ఈ తీర్పును చెంపపెట్టుగా భావిస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ఎన్నో అక్రమ అరెస్టులు మరీ ముఖ్యంగా వాక్ స్వాతంత్ర్యాన్ని కట్టడి చేయాలని కూటమి ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందని చెప్పడానికి ఇంతకంటే నిదర్శనం మరొకటి ఉండదన్నారు. సీనియర్ పాత్రికేయుడు కొమ్మినేని శ్రీనివాసరావును అరెస్టు చేయడం సమంజసం కాదని, 70 ఏళ్ల వయసు గల సీనియర్ పాత్రికేయుడి అరెస్ట్ చేయడం, లేని పోని ఎస్సీ, ఎస్టీ అక్రమ కేసులు పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

అధికారుల బదిలీలు..

పాలకొండ రూరల్: మండలంలో ఇంతవరకు పనిచేసిన సీడీపీఓ బి.సిమ్మాలమ్మకు సీతంపేటకు బదిలీ జరిగింది. ఈమె స్థానంలో సీతంపేట సీడీపీఓ రంగలక్ష్మి రానున్నట్లు సిబ్బంది శుక్రవారం తెలిపారు. ఈ క్రమంలో సిమ్మాలమ్మ విధి నిర్వహణలో సహ సిబ్బందికి అందించిన సేవలను సూపర్‌వైజర్లు దశారత్నం, మేరీతో పాటు అంగన్‌వాడీ సిబ్బంది గుర్తు చేసుకున్నారు. స్థానిక ఉద్యానవన అధికారి తమ్మినేని అమరేశ్వరి శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లకు బదిలీపై వెళ్లారు. అయితే అమరేశ్వరికి పాలకొండ ఇన్‌చార్జ్ బాధ్యతలు కూడా అప్పగించారు. పాలకొండ నగర పంచాయతీ మేనేజర్ జయరామ్‌కు విజయనగరం జిల్లా నెల్లిమర్లకు బదిలీ జరిగింది.

హద్దు మీరితే చర్యలు తప్పవు

• ఎస్సై ప్రయోగమూర్తి



సమస్యలు తలెత్తితే సమాచారం అందించాలంటూ సూచనలు చేస్తున్న ఎస్సై ప్రయోగమూర్తి

పాలకొండ రూరల్: వేడుకల పేరిట జనావాసాల మధ్య హద్దు మీరితే బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని ఎస్సై కె.ప్రయోగమూర్తి స్పష్టం చేశారు. పట్టణ పరిధిలోని వివిధ కూడళ్ల వద్ద యువత, మరికొందరు శుభకార్యాలు, పుట్టిన రోజులు, ఇతర వేడుకల పేరిట అర్ధరాత్రి చేస్తున్న హడావిడిపై అందుతున్న ఫిర్యాదులపై పోలీసులు స్పందించారు. తాజాగా జనావాసాల మధ్య, రోడ్లపై చేపట్టిన పార్టీలు, మందుగుండు కాల్చడం వంటి చర్యలపై శుక్రవారం ఆరా తీశారు. ఈ తరహా సంఘటనలపై ఏ క్షణమైనా సమాచారం అందిస్తే తక్షణమే చర్యలు తీసుకుంటామన్నారు.

గ్రీన్ అంబాసిడర్ల ఆందోళన



ఆందోళన చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు

బాడంగి: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రీన్ అంబాసిడర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఎ.సురేష్ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా చేశారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద నినదించారు. పెండింగ్‌లో ఉన్న తమ జీతాలు చెల్లింపుపై స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో వీరి ఆందోళనను విరమించాలని ఇంచార్జ్ ఎంపీడీవో శ్రీలత కోరారు. సమావేశం జరుగుతున్నందున ఎంపీడీవో వచ్చిన తరువాత సమస్యలపై చర్చించవచ్చని సూచించారు. ఈ క్రమంలో మండల సమావేశంలోకి ప్రవేశించేందుకు ఆందోళనకారులు ప్రయత్నించగా పోలీసులు నిలువరించారు. బకాయి జీతాలు చెల్లించాలని, టెండర్ విధానాన్ని రద్దు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని తదితర డిమాండ్లు నెరవేర్చాలని నినాదాలు చేశారు.

ప్రజా సమస్యలు పట్టని ప్రభుత్వం



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా నాయకుడు రెడ్డి వేణు

• ఏడాది కూటమి పాలనలో తప్పని అప్పులు

సీతానగరం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలం పూర్తి చేసుకున్నప్పటికీ ప్రజలకు అప్పులు తప్ప చేసిన అభివృద్ధి శూన్యమని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రెడ్డి వేణు అన్నారు. ఈ మేరకు సీపీఎం మండల కమిటీ సభ్యులతో కలిసి చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లాకు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది చంద్రబాబు పాలన ప్రజలకు అసంతృప్తి మిగిల్చిందన్నారు. పార్టీ మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీ ఒక్కటి కూడా ఇంతవరకూ అమలు చేయడం లేదని ఆరోపించారు. సంక్షేమపథకాలు అందక ప్రజలు ఆర్థిక ఇబ్బందులకు గురికావాల్సి వస్తోందన్నారు. గత ప్రభుత్వంకన్నా మెరుగైన సేవలందిస్తామని హామీఇచ్చిన చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వంతో ఎటువంటి ప్రయోజనం ప్రజలకు కలగక పోవడం పట్ల అసంతృప్తిగా ఉన్నారని తెలియ జేశారు.

సాగునీటి కోసం ఇబ్బందులు

పార్వతీపురం నియోజకవర్గంలో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తామని ఇచ్చిన హామీ ఇంతవరకూ అమలు చేయకపోవడంతో వనరులున్నా సాగునీరు కోసం ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. కౌలు రైతు సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రమణమూర్తి మాట్లాడుతూ కౌలురైతులకు ఖరీఫ్‌కు రుణ సహాయం అందిస్తామని ఇచ్చిన హామీ ఇంతవరకూ పట్టించుకోలేదని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రజా సంక్షేమం పట్ల శ్రద్ధతీసుకోవాలని కోరారు.

పీఎం సూర్యఘర్ పవర్‌ను వినియోగించు కోవాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్

సీతానగరం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం సూర్యఘర్ పథకంపై అవగాహన కల్పించుకుని రాయితీలను వినియోగించుకోవాలని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు మండలకేంద్రంలో ఏపీఈపీడీసీఎల్ ఏఈ విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యుత్ అధికార సిబ్బంది వినియోగదారులకు 'సోలార్ రూఫ్‌టాప్ విధానం ద్వారా సోలార్‌విద్యుత్ వినియోగం, సోలార్ పథకానికి ప్రభుత్వం ఇస్తున్న రాయితీలపై వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొగ్గు నీరుతో ఉత్పత్తి చేస్తున్న విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నప్పటికీ వినియోగదారులకు సరిపోవడం లేదని, సొంతంగా సోలార్ విధానం ద్వారా విద్యుత్ తయారుచేసుకోవచ్చన్నారు. సోలార్‌కు కిలోవాట్స్‌ను అనుసరించి అయ్యే ఖర్చులు ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం ద్వారా రాయితీ, బ్యాంక్ ద్వారా రుణగా ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. ఏఈ విశ్వేశ్వరరావు మాట్లాడుతూ యూనిట్ ధర గణనీయంగా పెరుగుతున్నందున అందుకవసరమైన విద్యుత్ ఉత్పత్తి కావడం లేదన్న కారణంగా కేంద్రప్రభుత్వం ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం ద్వారా సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసి ఇంటికి విద్యుత్ వినియోగం, మిగులు విద్యుత్ కొనుగోలు చేయడానికి అవకాశం కల్పించిందన్నారు. గ్రామాల్లో విద్యుత్ వినియోగదారులు పీఎం సూర్యఘర్ కార్యక్రమాన్ని వినియోగించు కోవాలని కోరారు. కార్యక్రమంలో విద్యుత్ వినియోగదారులు, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మార్పు బాలకృష్ణమ్మ జయంతి



జయంతి వేడుకల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు

సీతానగరం: ఉపాధ్యాయుల హక్కులు విధులు, విధానాలు, హక్కులకోసం నిరంతరం శ్రమించిన మార్పుబాలకృష్ణమ్మ సేవలు ఉపాధ్యాయులకు స్ఫూర్తి దాయకమని ఏపీటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు పి.సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు స్థానిక మండల విద్యావనరుల కేంద్రం ఆవరణలో శుక్రవారం మార్పు బాలకృష్ణమ్మ జయంతి వేడుకలను పురస్కరించుకుని ఆయన చిత్ర పటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడానికి రాష్ట్ర వ్యాప్తంగా చైతన్యపరిచి విధులు విధానాలు, హక్కులపై పోరాటం చేసిన మహనీయుడి సేవలు చిరస్మరణీయంగా ఉంటాయన్నారు.

ఉపాధ్యాయ సంఘానికి మార్గదర్శకుడిగా ఉన్న మార్పు బాలకృష్ణమ్మ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ఏపీటీఎఫ్ యూనియన్ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. జయంతి వేడుకల కార్యక్రమంలో ఏపీటీఎఫ్ యూనియన్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెకు కార్మికులంతా సిద్ధం కావాలి

• సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్

తెర్లాం: కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని కోరుతూ జూలై 9న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెకు కార్మికులంతా సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ పిలుపునిచ్చారు. తెర్లాంలోని పాత వెలుగు కార్యాలయం వద్ద సీఐటీయూ మండల అధ్యక్షుడు ఎస్.గోపాల్ అధ్యక్షతన మండల మహాసభను శుక్రవారం నిర్వహించారు. మహాసభలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం, ప్రధానమంత్రి మోదీ ప్రవేశ పెట్టిన నాలుగు లేబర్ కోడ్స్ దేశంలో అమలు జరిగితే కార్మిక వర్గాన్ని కట్టు బానిసలు అవుతారన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 4 లేబర్ కోడ్స్‌ను ఏ రాష్ట్రం అమలు చేయకపోయినా మన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం పని గంటలను 8 నుంచి 12 గంటలకు మార్చేందుకు ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో తీర్మానం చేయడం దుర్మార్గమన్నారు. ఇది కార్మికులకు రక్షణ లేకుండా చేయడమేనన్నారు. లేబర్ కోడ్స్ అమలు జరిగితే కార్మికులకు ప్రస్తుతం ఉన్న ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు ఉండవన్నారు. దీనికి నిరసనగా జూలై 9న దేశ వ్యాప్త సమ్మెకు అన్ని కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయని, దేశవ్యాప్త సమ్మెకు ప్రతీ ఒక్కరూ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ దాని అనుబంధ సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ గౌరి

బాడంగి: మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ భోగి గౌరి అధ్యక్షతన శుక్రవారం జరిగిన మండల సమావేశం సాదాసీదాగా సాగింది. అజెండా మేరకు శాఖల వారీగా అధికారులు మాట్లాడారు. వ్యవసాయ శాఖపై ఏవో శిరిష మాట్లాడుతూ విత్తనాలు, ఎరువులు, పచ్చిరొట్ట విత్తనాలు ఆర్‌బీఎస్‌లలో సిద్ధంగా ఉంచామన్నారు. రైతులు తీసుకోవచ్చన్నారు. కౌలు రైతులు సీసీ కార్డులు కచ్చితంగా పొందాలని సూచించారు. రెవెన్యూ శాఖపై చర్చ సమయంలో వైస్ ఎంపీపీ భాస్కరరావు మాట్లాడుతూ రెవెన్యూ ఎటువంటి సమస్యలు పరిష్కారం కావడం లేదని, ముటేషన్లు పెండింగ్‌లో పెట్టేస్తున్నారని, కేవలం సర్టిఫికెట్లు మాత్రమే చేస్తున్నారన్నారు. ఉపాధిపై ఏపీవో మాట్లాడారు. ఏప్రిల్ నెలాఖరు వరకు ఉపాధి హామీ బిల్లులు జనరేట్ అయ్యాయని మే నెలమాత్రమే పెండింగ్ ఉంటాయన్నారు. ఆరోగ్య శాఖ పద్దుపై డాక్టర్ ఆదిత్య మాట్లాడుతూ జాతీయ స్థాయిలో రెండు వ్యాధుల నివారణకు సర్వేలు, చికిత్సలు జరుగుతున్నాయని అన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, వైస్ ఎంపీపీ బి.రమేష్, ఎస్.భాస్కరరావు, ఇంచార్జ్ ఎంపీడీవో శ్రీలత, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులపై కేసు కొట్టివేతతో హర్షాతిరేకాలు



హర్షం వ్యక్తం చేస్తున్న కార్మికులు

బొబ్బిలి: గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 279 జీవోకు వ్యతిరేకంగా పోరాడుతున్న పారిశుద్ధ్య కార్మికులపై పెట్టిన కేసును బొబ్బిలి కోర్టు కొట్టివేసినట్టు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకరరావు తెలిపారు. శుక్రవారం స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడారు. అప్పట్లో మున్సిపల్ కార్మికులు రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెకు దిగారన్నారు. ఈ నేపథ్యంలోనే ప్రైవేటు కార్మికులను ప్రభుత్వం పెట్టిందన్నారు. వారినీ రెగ్యులర్ కార్మికులు అడ్డుకోవడంతో మున్సిపల్ ఆస్తులను ధ్వంసం చేసినట్టు 20 మంది కార్మికులపై పోలీసులు కేసులు పెట్టారన్నారు. ఈ కేసు ఇన్నాళ్ల వరకూ నడిచిందనీ అయితే ఆధారాలు లేకపోవడంతో శుక్రవారం స్థానిక న్యాయమూర్తి కేసును కొట్టివేసినట్టు చెప్పారు. కార్మికుల పక్షాన సీనియర్ న్యాయవాది చందాన సూర్యనారాయణ కేసును వాదించినట్టు శంకరరావు తెలిపారు. కేసు కొట్టివేయడంతో కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. ఎప్పటికైనా న్యాయం గెలుస్తుందన్నారు.